క్లుప్తంగా

పాఠశాలల ఆడిట్ వాయిదా వేయాలి

పార్వతీపురం టౌన్: విద్యా శాఖలో ఉపాధ్యాయ పదోన్నతి, బదిలీల నోటిఫికేషన్ జారీ చేసినందున ప్రభుత్వం నిర్వహించబోతున్న పాఠశాలల ఆడిట్ వాయిదా వేయాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ మన్యం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతాడ రాము, బి.నర్సింగరావు కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసారు. ప్రస్తుతం ఉపాధ్యాయులంతా పదోన్నతి, బదిలీలకు సంబంధించి వెబ్ అప్లికేషన్లు పెట్టుకొనేందుకు సుదూర ప్రాంతాలలో ఉన్న నెట్‌సెంటర్లు బాట పట్టినందున జిల్లాలో పాఠశాలల ఆడిట్ నిర్వహించేందుకు ప్రస్తుత షెడ్యూలును వాయిదా వేసి వేసవి సెలవులు అనంతరం షెడ్యూల్ ఇవ్వాలని కోరారు.

అధ్వానంగా కూర్మరాజుపేట రహదారి



గోతులతో ఉన్న కూర్మరాజుపేట రోడ్డు

సాలూరు రూరల్: మండలంలోని కూర్మరాజుపేట రోడ్డు గోతులతో వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారింది. మామిడిపల్లి అడ్డు రోడ్డు నుంచి కూర్మరాజుపేట మీదుగా పునికిని వలస గ్రామం వరకు రోడ్డు గుంతలతో వాహన చోదకులకు ప్రమాదకరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు నిర్మాణం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రీ క్లాంప్సియాపై జాగ్రత్తలు పాటించాలి



వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్న డా.తిరుమల ప్రసాద్

పార్వతీపురం రూరల్: మండలంలోని బందలుప్పిలో గురువారం ప్రపంచ ప్రీక్లాంప్సియా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.తిరుమల ప్రసాద్ నేతృత్వంలో హైపర్ టెన్షన్ డిజార్డర్‌పై అవగాహన కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాధారణ సమయంలో ప్రతి తల్లి కచ్చితంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రీక్లాంప్సియాను పూర్తిగా నివారించకపోయినా కచ్చితంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, నాగమ్మ, తదితర వైద్యుసిబ్బంది ఉన్నారు.

జీడి ప్రాసెసింగ్ యూనిట్ పనులు పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్



జీడి ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

పార్వతీపురం టౌన్: పట్టణ పరిధిలో మార్కెట్ యార్డులో నిర్వహించనున్న జీడి ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులను గురువారం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. నాణ్యమైన జీడి పిక్కలను కొనుగోలు చేయాలని, బ్రాండింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఆర్‌వో హేమలత,, గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ మణిరాజ్, ఏపీవో మురళీధర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు



పులిగుమ్మి సాకిగెడ్డ వద్ద ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక బోర్డు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలంలోని పులిగుమ్మి గ్రామ శివారులో ఉన్న సాకిగెడ్డ ప్రవాహం వద్ద పార్వతీపురం గ్రామీణ పోలీసులు ప్రమాద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ నెల 19న గ్రామానికి వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు సాకిగెడ్డ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందడంతో ప్రమాద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నట్టు రూరల్ ఎస్ఐ బి.సంతోషికుమారి పేర్కొన్నారు. అలాగే తల్లిదండ్రులు పిల్లలు బయటకు వెళ్లేటప్పుడు నేల బావులు, చెరువులు, వ్యవసాయ బావులు, గెడ్డలు, వాగులు వంటి ప్రదేశాలకు వెళ్లకుండా దృష్టి సారించి జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు.

సర్వర్ డౌన్...!



బలిజిపేట సచివాలయం

- రేషన్ కార్డు దరఖాస్తుల కోసం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- రోజూ నిరీక్షణే...
- విసిగిపోతున్న దరఖాస్తుదారులు

బలిజిపేట:

కూటమి ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ దాదాపు నిర్వీర్యం అయ్యింది. ఈ తరుణంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన దరఖాస్తుదారులకు సర్వర్ డౌన్ పేరిత విసుగు తెప్పిస్తోంది. దీంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. సచివాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సి వస్తుండడంతో దరఖాస్తుదారులు విసిగిపోతున్నారు. అర్హత ఉన్న వారు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు.. రేషన్ కార్డులో చేర్పులు, మార్పులు చేసుకునేందుకు ప్రభుత్వం ఇటీవల అవకాశం కల్పించింది. దీంతో ఎన్నాళ్లగానో ఎదురు చూస్తున్న ప్రజలు ఎంతో ఆసక్తితో సచివాలయాలకు వెళ్తున్నారు. అయితే కనీసం పని కూడా కాకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. గంటల తరబడి సచివాలయాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొనడంతో విసిగెత్తిపోతున్నారు. ఇక్కడ కనీస సేవలు కూడా రేషన్ కార్డుల కోసం అందడం లేదని ధ్వజమెత్తుతున్నారు.

సచివాలయాల వద్ద పడిగాపులు

కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి, రేషన్‌కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి ప్రజలు సచివాలయాలకు వెళ్తున్నారు. అక్కడ సర్వర్ పని చేయకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఉదయం నుంచి అక్కడే నిరీక్షిస్తున్నా సర్వర్ సమస్య ఉందని, మళ్లీ రావాలని సచివాలయ సిబ్బంది దరఖాస్తుదారులకు చెబుతుండడంతో అవస్థలు పడుతున్నారు. అలాగే మార్పులు, చేర్పులకు ఈకేవైసీ చేయించేందుకు అధికారులు ఎంత ప్రయత్నం చేసినా సర్వర్ తీసుకోవడం లేదని చెబుతున్నారు. రేషన్‌కార్డు దరఖాస్తుల స్వీకరణ మొదలైనప్పటి నుంచి సర్వర్ సమస్యతో గ్రామీణులు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లి స్వగ్రామాలకు వచ్చి దరఖాస్తు చేసుకుంటున్న వారి పరిస్థితి మరీ దారుణంగా మారింది. పొట్టకూటి కోసం నగరాలకు వలసబాట పట్టామని, రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నిస్తుంటే సర్వర్ పని చేయడం లేదని సిబ్బంది చెబుతుండడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. దరఖాస్తులు చేసుకునే వారికి సిబ్బంది జవాబు చెప్పేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది. సర్వర్ ఎప్పుడు పని చేస్తుందో, ఎప్పుడు పని చేయదో వారికి తెలియకపోవడంతో దరఖాస్తుదారుల నుంచి వచ్చే ఒత్తిడిని భరించాల్సి వస్తుంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం

రేషన్‌కార్డులకు దరఖాస్తులు చేసుకునే వారికి ఎదురవుతున్న సర్వర్ డౌన్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తాం. దరఖాస్తుదారులు దీనిని గమనించాలి.

– రమేష్‌బాబు, సీఎస్‌డీటీ, బలిజిపేట

● కుక్కల స్వైర విహారం



పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ప్రధార రహదారి పశువులు, కుక్కలకు ఆవాసంగా మారింది. కుక్కలు గుంపులుగా సంచరిస్తూ పాదచారులను, వాహన చోదకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కొన్ని చోట్ల వాహన చోదకులను వెంబడిస్తూ ఆందోళన కలిగిస్తున్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు. – పార్వతీపురం రూరల్

● అవగాహన ర్యాలీ



ప్రపంచ ప్రీ క్లాంప్సియా డే సందర్భంగా గర్భిణులకు అధిక రక్తపోటు నివారణపై అవగాహన ర్యాలీని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భగా వైద్యాధికారిణి మాట్లాడుతూ గర్భిణులు అధిక రక్తపోటుకు గురి కాకుండా ఎలా ఉండాలో అవగాహన కల్పించారు. అధిక రక్తపోటు వల్ల తల్లీబిడ్డకు ప్రమాదం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సత్యనారాయణ, సూపర్‌వైజర్ నాని, హెల్త్‌అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు, బి.జ్యోతీష్, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు. – బలిజిపేట

కార్మిక శ్రేయస్సుకు పాటుపడిన పర్సా



సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాలు

బలిజిపేట: కార్మిక నేత, కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు పర్సా సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా సీఐటీయూ కార్యాలయంలో ప్రజాసంఘాల నాయకులు ఆయన చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు మాట్లాడుతూ సత్యన్నారాయణ 19సంవత్సరాల వయస్సులోనే కమ్యూనిస్టు ఉద్యమంలో చేరి నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి సాయుధ పోరాటానికి సిద్ధం చేశారన్నారు. సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమర శంఖం పూరించి వారికి బాసటగా నిలిచారన్నారు. కార్మికుల జీవితాల కోసం అనేక పోరాటాలు నిర్వహించి కార్మిక శ్రేయస్సుకు పాటుపడిన గొప్ప నాయకుడన్నారు. కార్యక్రమంలో ఎస్.ఈశ్వరరావు, సీతారాం, భాస్కరరావు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

చెరువులు, గెడ్డల ఆక్రమణలను తొలగించాలి

- ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి



డీఆర్‌వో హేమలతకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి

పార్వతీపురం టౌన్: పట్టణంలోని దేవునిబంద, కామయ్యబంద, నెల్లిచెరువు, వరహాలగెడ్డ తదితర చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని, వెంటనే వాటిని తొలగించే ప్రక్రియ చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వో కె.హేమలతకు ఆక్రమణలపై గురువారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో సాగు, తాగు చెరువులు గెడ్డలన్నీ కబ్జాలకు గురైనట్టు స్పష్టంగా తెలుస్తుందని, రెవెన్యూ అధికారులకు కనిపించకపోవడం గమనార్హం అన్నారు. వరహాలగెడ్డ ఆక్రమణ చేసి భవనాలు కట్టిన 24 మందికి నోటీసలు కూడా ఇచ్చారని కానీ ఇంతవరకు నోటీసులు అందించిన వారిపట్లగానే ఎటువంటి తొలగింపు చర్యలు తీసుకోకపోవడం చాలా అన్యాయమని మండిపడ్డారు. ప్రతీ ఆక్రమణ నోటీసులకు రూ.లక్షల డబ్బు చేతులు మారడం వలన ఆక్రమణలు తొలగింపు ఆగిపోయినట్లు పట్టణంలో ప్రజల చెంత ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయని, నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికారులకు లేదా అని ప్రశ్నించారు. ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే చెరువులను, గెడ్డలను, భూములను కబ్జాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటువంటి వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఇప్పటికైనా ఆక్రమణలను తొలగించి ప్రజా ప్రయోజనాల కొరకు ఉపయోగించాలని, లేకుంటే భవిష్యత్తులో ఆందోళన చేపడతామని తెలిపారు.

రబీలో రైతుల ఇక్కట్లు



సీతానగరంలో ఆరబెట్టిన ధాన్యాన్ని భద్రపరుస్తున్న రైతులు

సీతానగరం: మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసిన వరి దిగుబడులు వచ్చాయి. అయితే వీటిని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ఇంటికి చేర్చేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని పెదబోగిలి, సీతానగరం, బుడ్డిపేట, చెల్లంనాయుడువలస, లక్ష్మీపురం, బూర్జ, ఆవాలవలస, తామరకండి తదితర గ్రామాల్లో రైతులు రబీలో వరి సాగు చేశారు. అధిక పెట్టుబడులు పెట్టి పండించిన పంట కొనుగోలుతో ప్రభుత్వం చొరవ చూపడం లేదు. దీంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. ఈ క్రమంలో దళారులకు తక్కువ ధరకే ధాన్యం విక్రయించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికై నా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

టీఏసీ ఏర్పాటుపై హర్షం

పార్వతీపురం: రాష్ట్రంలో ట్రైబల్ అడ్వయిజరీ కౌన్సిల్(టీఏసీ) ఏర్పాటుపై ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. టీఏసీ ఏర్పాటుకు కృషి చేసిన గిరిజన సంక్షేమ మంత్రికి జేఏసీ నాయకులు టి.జయన్న, డి.సీతారాం, ఎ.చంద్రశేఖర్, ఇంటికుప్పల రామకృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు.

ఈవీఎం గోదాము పరిశీలన



ఈవీఎం గోదాములను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద గల ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా గురువారం ఆయన గోదాములను సందర్శించి అక్కడ పరిస్థితిని గమనించారు. గోదాములకు వేసిన సీళ్లను ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టరులో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూ, ఏర్పాట్లపై పరిశీలించి అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, తహసీల్దార్ వై.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం

సీతానగరం: మండలంలోని సువర్ణముఖి నదీపై బూర్జ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన ప్రాథమిక పనులు ప్రారంభించామని పీఆర్ ప్రాజెక్ట్స్ ఏఈ జి.శంకరరావు తెలిపారు. నదిపై బూర్జ పాతబూర్జ నీలాటి రేవులో గురువారం తీస్తున్న బోర్లును ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నాబార్డు ఆర్ఐడీఎఫ్ నిధులతో బూర్జ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి సాంకేతికపరమైన ఇబ్బందులను నివృత్తి చేయడానికి, ఇసుకలో రాఫ్ ఎంత లోతులో ఉందో తెలుసుకునేందుకు బోర్లు తీయిస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



పార్వతీపురం టౌన్: బైపాస్ కాలనీలో పూజలు అందుకుంటున్న అభయాంజనేస్వామి



సీతానగరం: హనుమాన్ జంక్షన్‌లో అభయాంజనేయస్వామికి పూజలు

హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాలకు గురువారం భక్తులు పోటెత్తారు. వైకేఎం కాలనీ, బైపాస్‌కాలనీ, హనుమాన్ జంక్షన్, రాయగడ రోడ్డు వద్ద గల అభయాంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



సీతానగరం: వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఆంజనేయస్వామికి పూజలు



మక్కువ: బట్టివలస గ్రామంలో ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



పార్వతీపురం టౌన్: హనుమాన్ జంక్షన్‌లో స్వామివారు

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పార్వతీపురం టౌన్:

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఉదయం 12 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన, ఎమ్మెల్యే విజయ చంద్ర ఆధ్వర్యంలో సమావేశం జరగనున్నట్టు పేర్కొన్నారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని సూచించారు.

బహిరంగ వేలం రేపు

పార్వతీపురం టౌన్: ఐడీఎస్ఎంటీ దుకాణాల బహిరంగ వేలం శనివారం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న షాపులు 22, 32, 34, 35, 44, 46, 48 కాంట్రాక్ట్ నిబంధనల ప్రకారం అద్దెకు ఇచ్చేందుకు శనివారం ఉదయం 11 గంటలకు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో వేలం వేయనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయ పని గంటల్లో రెవెన్యూ సెక్షన్‌లో సంప్రదించాలని సూచించారు.